క్లుప్తంగా

నూకాలమ్మకు సువర్ణ నేత్రాల సమర్పణ



సువర్ణ నేత్రాలతో నూకాలమ్మ తల్లి

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని నూకాలమ్మ తల్లికి సువర్ణనేత్రాలు సమకూరాయి. పట్టణానికి చెందిన పోలుకొండ లలితకుమారి, హర్షవర్థిని రూ. 56 వేలు విలువైన సువర్ణ నేత్రద్వయం (రెండు బంగారు కళ్లు) ఆలయ కమిటీకి అందజేశారు. తొలుత శుక్రవారం సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు జరిపారు. అమ్మవారి ఉత్సవ మూర్తికి పంచామృతాభిషేకాలు, వేదదర్బారు సేవ, చతుర్వేద స్వస్తి తదితర పూజలు మనోజ్ శర్మ నిర్వహించారు. అనంతరం దాతలు ఇచ్చి సువర్ణ నేత్రాలను అమ్మవారికి అలంకరించారు. ఈ సందర్భంగా దాత కుటుంబసభ్యులకు అమ్మవారి శేష వస్త్రాన్ని, చిత్ర పటాన్ని ఇచ్చి వేద ఆశీర్వాదంతో ఘనంగా సత్కరించారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

టి.నరసాపురం : విద్యుత్ మరమ్మతులు, ట్రీ కటింగ్ తదితర పనుల నిమిత్తం ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు టి.నరసాపురం, కేవీఆర్ పోతేపల్లి విద్యుత్ ఉప కేంద్రాల పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ కేఎం అంబేడ్కర్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

12 నుంచి ప్రవేశాలు

టి.నరసాపురం : గురుకుల పాఠశాల, జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశ పరీక్షల్లో ఎంపికైన వారికి 12 నుంచి ప్రవేశాలు కల్పిస్తున్నట్లు అప్పలరాజుగూడెం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ టీఎస్‌స్వామి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యాసంవత్సరానికి గాను 5, 6, 7, 8 తరగతులు, ఇంటర్, డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ప్రవేశానికి మే 20న పరీక్ష నిర్వహించామని, ఈనెల ఈ నెల 8న ఫలితాలు విడుదల చేసినట్లు తెలిపారు. ఎంపిక జాబితాను httpr://aprra pcfrr.in వెబ్‌సైట్‌లో ఉంచడం జరిగిందన్నారు. ఫలితాలను సదరు విద్యార్థులు ఐడీ నెంబర్ లేదా హాల్ టికెట్ నంబర్ ద్వారా వెబ్‌సైట్ నుంచి తెలుసుకోవచ్చని చెప్పారు.

సంఘటితంగా ఉద్యమించాలి



ప్రైవేట్ ఎలక్ట్రికల్ మోటార్స్ ప్లంబర్ అసోసియేషన్ సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : భవన నిర్మాణ కార్మికులు సంఘటితంగా ఉద్యమాలు నిర్మించాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు కేవీ మణ అన్నారు. జంగారెడ్డిగూడెం ప్రైవేట్ ఎలక్ట్రికల్ మోటార్స్ ప్లంబర్ అసోసియేషన్ వర్కర్స్ యూనియన్ సంఘం ఏర్పాటు చేసి 14 ఏళ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు ఆవుల పుల్లారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమాసంలో కేవీ రమణ మాట్లాడుతూ సంఘంలోని కార్మికులకు ప్రమాదాలు జరిగినప్పుడు, మరణించినప్పుడు లేదా తీవ్రంగా అనారోగ్యానికి గురైనప్పుడు సంఘం ఆర్థికంగా ఆదుకుందని తెలిపారు. ప్రభుత్వ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై కార్మికులంతా సంఘటితంగా ఉద్యమించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో కోట శివకృష్ణ, తీయల గణేష్, పారేపల్లి రామారావు, బాలిన ధర్మరాజు, గెడ్డం సురేష్, తిప్పాని బాబు, పుచ్చల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాల్గో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని వినతి

చింతలపూడి : ప్రభుత్వ పాఠశాలల్లో 2015 నుంచి పనిచేస్తున్న స్వీపర్, ఆయాలను నాల్గో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి కె బుచ్చిబాబు, అధ్యక్షులు టి బాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శుక్రవారం ఎంపీడీఓ మురళీకృష్ణకు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పాఠశాలల్లో ఉండి అన్ని పనులు చేస్తున్న స్వీపర్‌లకు ఉద్యోగ భద్రత లేదన్నారు. అనారోగ్యం వస్తే ఆసుపత్రికి వెళ్లడానికి సెలవు కూడా దొరకని పరిస్థితి ఉందని అన్నారు. ప్రభుత్వం తక్షణం స్పందించి వీరి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో కన్నమ్మ, జ్యోతి, బూసమ్మ, లక్ష్మి, కృష్ణకుమారి పాల్గొన్నారు.

అక్కంపేటలో గ్రామసభ

జంగారెడ్డిగూడెం రూరల్ : అక్కంపేటలో జగనన్న భూహక్కు – భూ రక్ష కార్యక్రమ గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ పారేపల్లి నాగేంద్రబాబు, ఉప సర్పంచ్ వింజమూరి కిరణ్ కిషోర్, ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ పాల్గొని రైతులతో మాట్లాడి సమస్యలు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సర్పంచ్ నాగేంద్రబాబు మాట్లాడుతూ అక్కంపేటలో ఉన్న భూమి హక్కుల రికార్డుల్లో ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఉప సర్పంచ్ కిరణ్ కిషోర్, ఎంపీడీవో కిరణ్‌కుమార్ మాట్లాడుతూ రైతులకు మేలు చేసే అనేక కార్యక్రమాలను ప్రభుత్వం చేబడుతుందన్నారు. అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం



కొండగూడెం గ్రామం కొత్తపేట కాలనీలో లబ్ధిదారులకు సంక్షేమ లబ్ధి బుక్‌లెట్ అందజేస్తున్న చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా

కామవరపుకోట : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలోనే రాష్ట్రం సంక్షేమం, అభివృద్ధి సాధించడం సాధ్యపడుతుందని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. శుక్రవారం మండలంలో కొండగూడెం గ్రామం కొత్తపేట కాలనీలో నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల సమస్యల పరిష్కరించడం కోసమే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉద్దేశమని ఎవరైనా అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే అధికారుల దృష్టికి తీసుకురావాలని వెంటనే పరిష్కరించే దిశగా కృషి చేస్తానని తెలిపారు. లబ్ధిదారులకు ప్రభుత్వం అందించిన పథకాలు వివరిస్తూ బ్రోచర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధికి నోచుకోక, యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగులుగా మిగిలిపోయారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రం అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో పరిపాలన చేపట్టిన వెంటనే గ్రామ సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా యువతకు లక్షలాది ఉద్యోగాలు కల్పించి, రాష్ట్రంలోని ప్రతి ఇంటికి అందించిన నవరత్నాల సంక్షేమ పథకాలతో ప్రజలు లబ్ధి పొంది సంతృప్తిగా ఉన్నారని అన్నారు. దీనితో టీడీపీకి ప్రజాదరణ తగ్గి, జగన్ పరిపాలన నచ్చి టీడీపీ నాయకులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. మరలా రానున్నది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనని ఎమ్మెల్యే ఎలీజా ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మి, జెడ్పీటీసీ కడిమి రమేష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు మిడతా రమేష్ బాబు, కామవరపుకోట సర్పంచ్ కరిపోతు అనూష, రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ ఫైనాన్స్ డైరెక్టర్ పండు జగదీష్, ఎంపీటీసీ తమ్మిశెట్టి గిరిజ, కోటగిరి కిషోర్ బాబు, మల్లెల్లి బాలస్వామి, నల్లూరు ప్రభాకర్‌రావు, చిలుకూరి సుబ్బారావు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేయాలని వినతి

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎలీజాను నాయకుల పేటకు చెందిన గ్రామస్తులు కలిశారు. తమది నాయకుల కులం (ఎస్టీ) అని, 250 కుటుంబాల వరకు ఉన్నాయని, అయితే తమకు కుల ధ్రువీకరణ పత్రం మంజూరు చేయకపోవడంతో ప్రభుత్వం నుంచి వచ్చే అన్ని పథకాలు ఆగిపోయి తీవ్రంగా నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించుకునా పట్టించుకోడంలేదని ఎమ్మెల్యే ఎలీజాకు వివరించారు. వెంటనే స్పందించిన ఆయన సమస్యపై జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌తో ఫోన్లో మాట్లాడి వివరాలు తెలియజేశారు. త్వరగా ఈ సమస్య పరిష్కరించే దిశగా చర్య తీసుకుంటామని గ్రామస్తులకు ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బొల్లు వెంకట సత్యనారాయణ, రాయంకుల సత్యనారాయణ, కొవ్వూరి భాగ్యరాజు, వెత్రి శ్రీను, షేక్ మీరా సాహెబ్, నాగల సీతారాం బాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలి

చింతలపూడి : సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని ఎంపీపీ డా.బి రాంబాబు నాయక్ సూచించారు. రేచర్ల పంచాయతీలోని గ్రామ సచివాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శివరామకృష్ణ గ్రామంలో డ్రెయిన్ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. మండల పరిషత్ గ్రాంట్ నుంచి నిధులు మంజూరు చేస్తామని ఎంపీపీ హామీ ఇచ్చారు. ఎంపీడీఓ మురళీ కృష్ణ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది నూరు శాతం హాజరు కలిగి ఉండాలని ఆదేశించారు. ప్రతి సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా యూనిఫాం ధరించి రావాలని అన్నారు. ప్రతి రోజు 3 గంటలకు స్పందన కార్యక్రమం నిర్వహించాలని, ప్రజల సమస్యలను పరిష్కరించే విధంగా ఉద్యోగులు పని చేయాలని ఆదేశించారు.

జగన్‌తోనే రాష్ట్రంలో సుపరిపాలన



ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం : సంక్షేమ పథకాల అమలు తీరే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పారదర్శక పాలనకు అద్దం పడుతోందని, రాష్ట్రంలో సుపరిపాలన జగన్‌తోనే సాధ్యమని పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మండలంలోని లక్ష్మ డుగూడెం సచివాలయం పరిధిలోని కొమ్ముగూడెం గ్రామంలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బాలరాజు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. అదేవిధంగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుల, మత, వర్గ, పార్టీలకు అతీతంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ సీఎం వైఎస్ జగన్ చిత్తశుద్ధితో ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని అన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ లబ్ధి అందిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందని చెప్పారు. అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన వంటి పథకాల అమలులో మన రాష్ట్రానికి దేశంలోనే గుర్తింపు వచ్చిందన్నారు. వివిధ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారిని కూడా ఆర్థికంగా ఆదుకుంటున్న ఘనత ఈ ప్రభుత్వానిదే అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కారం శాంతి, జెడ్పీటీసీ మొడియం రామతులసి, సర్పంచ్ మడకం రామలక్ష్మి, వైస్ ఎంపీపీలు కుక్కల వరలక్ష్మి, గగ్గులోతు మోహన్‌రావు, ఎంపీటీసీ చారపు సుజాత, పార్టీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, రేపాకుల చంద్రం, కలగర నాని, అనుపోజు మురళీ, సత్యప్రకాష్, ఎంపీడీఓ వేణుగోపాల్ రెడ్డి, ఎంఈఓ బాబూరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్‌లు ు పాల్గొన్నారు.

నాడు–నేడుతో విద్యారంగంలో నూతన శకం



ఇందిరానగర్ కాలనీలో నాడు-నేడు పనులను పర్యవేక్షిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : నాడు–నేడుతో విద్యారంగంలో నూతన శకం మొదలైందని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. జంగారెడ్డిగూడెం ఇందిరా నగర్ కాలనీలో నిర్వహిస్తున్న నాడు నేడు పనులను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి మాట్లాడుతూ నూతన భవన నిర్మాణం కోసం రూ.13 లక్షలు, పాత భవనం మరమ్మతులు, ఫర్నీచర్, మంచినీటి సౌకర్యం, విద్యుత్, పెయింటింగ్ తదితర పనుల కోసం రూ.16 లక్షలు వెచ్చిస్తున్నట్లు తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా మార్చేందుకు నాడు–నేడు అమలు చేస్తున్నారన్నారు. విద్యారంగం అభివృద్ధిలో విశేషమైన కృషిచేస్తున్నారని, అన్ని సౌకర్యాలు కల్పిస్తున్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు విద్యనభ్యసించాలని కోరారు. కార్యక్రమంలో బత్తిన చిన్న, మానవత మూర్తి, చిప్పాడ వెంకన్న, ఉగ్గం ప్రసాద్, కాంట్రాక్టర్ కె.ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కృతజ్ఞతలు

ఇటీవల 4వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వంలో వచ్చిన సమస్యల పరిష్కారంపై కృషిచేసిన ఎమ్మెల్యే వీఆర్ ఎలీజాకు, చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మికి 4వ వార్డు ఇన్‌ఛార్జ్ చిప్పాడ వెంకన్న కృతజ్ఞతలు తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే వీఆర్ ఎలీజాకు ఇందిరానగర్ కాలనీ కొత్తపేటలో డ్రెయిన్ వ్యవస్థ సరిగా లేదని తెలియజేయడం జరిగిందన్నారు. దీంతో కొత్తపేటలో 200 మీటర్ల డ్రెయిన్ నిర్మాణానికి రూ. 8 లక్షలు మంజూరు చేశారన్నారు. ఈ సందర్భంగా సీఎం వైఎస్ జగన్‌కు, ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా, చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి చిన్నలకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

సోమ, గురువారాల్లో అందుబాటులో ఉంటా

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం మున్సిపల్ కార్యాలయంలో సోమ, గురువారాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటానని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. నిరంతరం పరిపాలన సంబంధిత పనులతో బిజీగా ఉన్నా ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు వారంలో రెండు రోజులు కేటాయిస్తానని, ప్రజలు తమ సమస్యలను నేరుగా తనకు తెలియజేయవచ్చన్నారు.





పాడి పశువుల మృతిపై పరిహారానికి సిఫార్సు

వేలేరుపాడు : వేలేరుపాడు మండలంలోని నార్లవరం గ్రామంలో ఇటీవల విద్యుత్ తీగలు తగిలి మృతి చెందిన నాలుగు పశువులకు సంబంధించి నష్ట పరిహారం అందించేందుకు చర్యలు తీసుకున్నట్లు విద్యుత్ శాఖ ఏడీ వెంకటరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పశువుల యజమాని దాసబోయిన రవికి ప్రభుత్వం నుంచి పరిహారానికి సిఫార్సు చేసినట్లు పేర్కొన్నారు. నార్లవరం ప్రాంతంలో వాగు ఒడ్డున ఉండటం వల్ల విద్యుత్ స్తంభాలు గాలివానలకు ఒక పక్కకు ఒరిగిపోయాయని, అందువల్లనే తీగలు కిందికి రావడం వల్ల ఈ ప్రమాదం జరిగినట్లు పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో విద్యుత్ వైర్లు ఎత్తులో ఉండే విధంగా కొత్తగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎల్ఐ కృష్ణమోహన్, జేఎల్ఎం ఎనాగేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉపకరణాలు సద్వినియోగపరచుకోండి

కామవరపుకోట : దివ్యాంగుల కోసం ప్రభుత్వం అందిస్తున్న ఉపకరణాలు సద్వినియోగపరచుకోవాలని ఎంపీడీవో కె.శ్రీదేవి అన్నారు. జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో దివ్యాంగుల గుర్తింపు శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో 75 మంది దివ్యాంగులకు అవసరమగు వివిధ ఉపకరణాలను గుర్తించారు. ఎంపీడీవో కె.శ్రీదేవి మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా అందించే వీల్‌చైర్స్, త్రిచక్ర వాహనాలు, వినికిడి యంత్రాలు, చేతి కర్రలు వంటి ఉపకరణాలు దివ్యాంగులు వినియోగించుకోవాలని అన్నారు. త్వరలో వీటిని అందజేస్తామని తెలిపారు. జిల్లా కో–ఆర్డినేటర్ డి.శ్రీనివాసరెడ్డి, ఫిజియోథెరపిస్ట్ రాంబాబు, నాగరాజు, కంబయ్య, జయలక్ష్మి, రష్మిత, ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్ట విరుద్ధం



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రమద్వర

కుకునూరు : బాల్య వివాహాలు చేయడం చట్ట విరుద్ధమని వాటిని అడ్డుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని కుకునూరు తహసీల్దార్ డీఎల్ ప్రమద్వర పేర్కొన్నారు. శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కుక్కునూరు ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బేటీ పడావో బేటీ బచావో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్ తహసీల్దార్ ప్రమద్వర మాట్లాడుతూ యువతి యువకులకు మైనారిటీ తీరకుండానే పెళ్లిళ్లు చేయకూడదని అన్నారు. బాలికలకు 18 ఏళ్లు, బాలురకు 21 ఏళ్లు నిండిన తర్వాతనే వివాహాలు చేయాలని సూచించారు. అలా కాదని చిన్న వయసులో పెళ్లిళ్లు చేస్తే, పెళ్లికి ప్రోత్సహించిన తల్లితండ్రులు, హాజరైన బంధువుల పైన కేసులు నమోదు చేయబడతాయని వారి పేర్కొన్నారు. నేటి సమాజంలో ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించి వారికి మంచి భవిష్యత్తు కల్పించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మీకుమారి, కె.మయూరి, వీఎస్ రుక్మిణి, స్టేషన్ రైటర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులకు సత్కారం

పోలవరం రూరల్ : పోలవరం మండల పరిషత్ కార్యాలయంలో పనిచేస్తున్న అధికారులను పంచాయతీ కార్యదర్శులు సన్మానించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీవో జి.శ్రీనుకు, పోలవరం మండల పరిషత్ కార్యాలయంలో ఈవోపీఆర్డీగా పనిచేస్తూ జీలుగుమిల్లి బదిలీ అయిన ఈవోపీఆర్డీ నిఖిల్ మధుకు, ఇప్పటి వరకు ఇన్‌ఛార్జ్ ఎంపీడీవోగా పనిచేసిన ఏవో సీహెచ్ శ్రీనివాసబాబుకు కార్యదర్శులు శాలువా కప్పి సన్మానించారు. అలాగే ఇటీవల ఏలూరు జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షులుగా ఎన్నికైన పోలవరం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డికి పంచాయతీ కార్యదర్శులు, ఏపీఎన్‌జీవో సంఘం సభ్యులు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కలుం హేమకుమారి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షులు బుగ్గా మురళీకృష్ణ, వైస్ ఎంపీపీ హేమల శ్రీదేవి, ఎంపీటీసీ వలవల వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, ఏపీఎన్‌జీవో సంఘం ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



ఏసుక్రీస్తు బోధనలు అనుసరణీయం



దివ్య పూజాబలి నిర్వహిస్తున్న ఏలూరు పీఠాధిపతి (బిషప్) పొలిమెర జయరావు

చింతలపూడి : ఏసుక్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరూ పాటించి దేవుని మార్గంలో నడవాలని ఏలూరు పీఠాధిపతి (బిషప్) పొలిమెర జయరావు బోధించారు. నిత్య సహాయమాత దేవాలయ మహోత్సవం, వేళంగిణి మాత గోపుర వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం బోయగూడెం ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ కామా మాధ్యూ నేతృత్వంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవ వాక్యంలోని దివ్య సందేశాలను భక్తులు గ్రహించి పరివర్తనతో ముందుకు సాగాలని అన్నారు. ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు మూడు రోజుల పాటు జేవియర్ బెదాని ఆధ్వర్యంలో నిర్వహించిన స్వస్తత సభలను అభినందించారు. తదుపరి దివ్య పూజాబలి నిర్వహించారు. కార్యక్రమానికి క్రైస్తవ భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.









